# జాజు కిటికి

సగం మాటల జామ పువ్వుతో

జల జలా రాలి గాలి

మిట్ట మధ్యాహ్నం

కల రక్తం పాదు మీద

జర జరా పాకుతూ

వో గ్నాపకం తనకేసి తనను బాదుకుంది

చచ్చిపోదు... పోదు

సుఖవంతుడా...

నీ తడికెల గోడ మీద

వేలాడిన వొకానొకప్పటి చర్మవాయిద్యాన్ని

వొస్తున్నానా

గ్నాపకమొస్తున్నానా...

రాత్రి వొక్కింటికి వురిమిన చినుకు

మన్ను గోలెం పక్కన

పొట్టు పొయ్యిలో చిట్లిన సొగసు

అప్పటి కళ్ళు ఇప్పటికీ... ... మండుతూనే వున్నాయి

కర్యాపాకు విత్తనాల నడుమ

భూమిపై పొర్లాడిన కుమ్మరి పురుగును

నన్ను చిదిమిన చేతిని

ఇప్పటికీ కరుస్తూనే... ఉన్నాను

ఉయ్యాలో ఉయ్యాలా
రేగుపొదలా చెల్కలు
పొడిపొడిగా వానలూ
సగం తడిసిన పాదాలూ
రక్తమోడిన కడియాలు
నన్నీ ఏడుపు మూలకు చేర్చీ...

చీటీల లంగా
తుమ్మకాయల కాటుక కన్నూ
నును నలుపు దేహం
జాజు రంగు కిటికీ...
ఎవరుల్లా...
ఎవరామె
కవిత్వమూ కాదు...
వూరూ... కాదు
ఏదీ కాదు
ఏదీ అందదు దాన్ని
ఎవరుల్లా...

సిద్ధార్థ
('బొమ్మలబాయి' – 15.7.1997)